ప్రభుత్వ బడులు.. సమస్యలకు నిలయాలు

- మధ్యాహ్న భోజనం చేయని విద్యార్థులు
- నాడు–నేడు నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం నీతకన్ను



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో ఇంటి వద్ద నుంచి బాక్సుల్లో భోజనం తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: పేద విద్యార్థులు చదువుకునే సర్కారు బడులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులను కూటమి సర్కారు అడ్డుకోవడంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపు, బాలలకు పౌష్టికాహారం అందజేయాలన్న సంకల్పంతో ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పాఠశాలల్లో 11,660 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా విద్యార్థులు భోజనంలో నాణ్యతను పట్టించుకున్న దాఖలాలు లేవని తల్లిదండ్రులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకునేందుకు ప్రతి రోజూ పర్యవేక్షణ ఉండటంతో పాటు మరింత నాణ్యంగా తయారు చేసేవారు. ప్రస్తుతం వంటలో రుచీ, శుచీ కొరవడటంతో చాలామంది విద్యార్థులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తినడం మానేశారు. దాదాపు మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులు ఇంటి వద్ద నుంచే భోజన క్యారేజీలను తీసుకుతెచ్చుకుని తింటున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే మధ్యాహ్న భోజన నాణ్యత ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. అలాగే విద్యార్థులకు ఇచ్చే చిక్కీలు కూడా గతంలో ఉన్నంత నాణ్యంగా ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

ముందుకు సాగని నాడు–నేడు పనులు

నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో గతంలో నాడు–నేడులో చేపట్టిన అదనపు తరగతి గదులు ఇంకా నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా పనులు ముందుకు సాగక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మల్లవరం, సీతారామపురం ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులకు నిధులు లేకపోవడంతో తరగతి గదులు నిర్మాణదశలోనే నిలిచిపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఫేజ్–2లో చేపట్టిన నాడు–నేడు పనులకు సంబంధించి మొగల్తూరు మండలంలో 46 పాఠశాలల్లో 31 అదనపు తరగతి గదుల నిర్మాణాలు, అభివృద్ధి పనులతో పాటు 10 అంగన్‌వాడీ భవనాలు కూడా నిర్మాణం పూర్తి కాకుండా నిలిచిపోయాయి. నరసాపురం మండలంలో ఫేజ్–2 నాడు–నేడు పనుల్లో భాగంగా చేపట్టిన 32 పాఠశాలల్లో నాడు–నేడు అభివృద్ధి పనులతో పాటు రెండు అంగన్‌వాడీ భవన నిర్మాణాలు కూడా నిధుల లేమి కారణంతో నిలిచిపోయాయి.

మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులు

	గతేడాది	ప్రస్తుతం
నరసాపురం మండలం	7363	7049
మొగల్తూరు మండలం	4759	4611
మొత్తం విద్యార్థులు	12,122	11,660

వంట ఏజెన్సీల మార్పు.. ఆయాల తొలగింపు

కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నాళ్లలోనే నరసాపురం పట్టణంలోని రాయపేట, వలంధరరేవు మున్సిపల్ పాఠశాలల్లోనూ, మండలంలోని పసలదీవి, బైనపాలెం, మండవారిపేటల్లోని ప్రాథమిక పాఠశాలల్లోను, చామకూరిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల తదితర ఆరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు మార్చారు. అలాగే మొగల్తూరు మండలంలోని కప్పరువారిపాలెం, కొత్తోట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలోని వంట ఏజెన్సీలను సరైన కారణాలు చూపకుండా తొలగించి కొత్తవారిని నియమించారనే విమర్శలు ఉన్నాయి. నరసాపురం పట్టణంలోని రాయపేటలోని లెనిన్ పాఠశాల, మండలంలోని మల్లవరం మండలపరిషత్ ప్రాదమిక పాఠశాలలోని టాయిలెట్లు శుభ్రం చేసి పని చేసే వారిని కూడా మార్చుచేశారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన చాలా కాలం వరకూ టాయిలెట్ల క్లీనింగ్ రసాయనాలు ఇవ్వకుండా విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి విమర్శలు రావడంతో ఇటీవలే టాయిలెట్ క్లీనింగ్‌కు రసాయనాలు ఇస్తున్నారు. ఆయాలకు కూడా ఇప్పటికే రెండు నెలలు జీతాలు అందలేదని వారంతా వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం తీరు ఉంటుంది. టాయిలెట్ క్లీన్ చేసే ఏజెన్సీలను కూడా మార్చడం కూడా జరిగిందంటే పాఠశాలల్లో రాజకీయ నేతల మితిమీరిన జోక్యం స్పష్టంగా తెలుస్తుందని ప్రజలు చెబుతున్నారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం: అధిక వర్షాలు, వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. మంగళవారం కమిషనర్ విష జ్వరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు శానిటరీ కార్యదర్శులు, ఏఎస్ఎంలతో తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులతో డెంగీ జ్వరాల ప్రమాదం పొంచిఉందని అన్నారు. ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిశుభ్రత విషయంలో వారికి అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాల బారిన పడితే ఇంటివద్ద వైద్యం తీసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం, ప్రయాణికుల సూచనలు, సలహాల కోసం మంగళవారం నిర్వహించ తలపెట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమం రద్దయ్యింది. తిరిగి ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి విలేకరులకు చెప్పారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటల వరకూ 99592 25486 నెంబర్‌కు సమస్యలపై ఫిర్యాదు చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీకి ఫ్రిడ్జ్ అందజేత



పీహెచ్‌సీలో ఫ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసాపురం: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో పీహెచ్‌సీకి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్ బహూకరించారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గన్నాబత్తుల సత్యవతి, బొమ్మిడి సూర్యకుమారి ఆస్పత్రి అధికారులకు ఫ్రిడ్జ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఫ్రిడ్జ్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని గతంలో వచ్చిన విజ్ఞప్తి మేరకు ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశామన్నారు. విద్య, వైద్య రంగాల్లో సేవాకార్యక్రమాలకు క్లబ్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కోట్ల రామ్‌కుమార్, తోట శ్రీధర్,తెనాకుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని వరిదనం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సత్యనారాయణ కుటుంబం ఆర్థికంగా, ఆరోగ్యంగా ఇబ్బందులు ఎదుర్కొనడంతో కాపు క్లబ్ సభ్యులు మంగళవారం నిత్యావసర సరుకులు అందించారు. క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలను ఆదుకోవడంతో కాపు క్లబ్ తనవంతు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, కఠారి నాగేంద్ర, కానూరి ప్రభాకర్, గంధం ఏసుపాదం, కొండ్రెడ్డి సూరిబాబు, శిరిగినీడి రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గణాంక దినోత్సవం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఓ నాగమణి

పాలకొల్లు సెంట్రల్: దేశ సుస్థిరాభివృద్ధికి, ఆర్థిక పురోభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి గణాంకాలు ఎంతో అవసరమని వీరవాసరం మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్ఓ) బి.నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక ఛాంబర్ కళాశాలలో ప్రపంచ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి విద్యార్థులతో మాట్లాడుతూ గణాంక శాస్త్రం చదివిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ ప్రాముఖ్యత ఇతివృత్తంలో ప్రతి సంవత్సరం స్టాటిస్టిక్స్ డే జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో స్టాటిస్టిక్స్ ఇన్‌చార్జ్ దీప్తి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెనుగొండ: ఇటీవల అనారోగ్యానికి గురైన పెనుగొండకు చెందిన మోదుకూరి సీతారామ వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందజేశారు. మంగళవారం కొమ్ము చిక్కాలలో జరిగిన కార్యక్రమంలో సీతారామ భర్త భవన్నారాయణకు రూ.67,550 చెక్కును అందించారు. కార్యక్రమంలో వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, బుల్లాలు, పులవర్తి రెడ్డియ్య గుప్తా పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు సంవత్సరాల నుంచి పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పారితోషికాలు అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాలకొల్లు పట్టణానికి చెందిన గాదె సుబ్బారావు నగదు, జ్ఞాపికలు విద్యార్థులకు అందజేశారు. 2022–23 సంవత్సరంలో ప్రథమ కండిబోయిన ఆదిత్య వెంకటసాయి, ద్వితీయ స్థానంలో నిలిచిన గుమ్మాపు జూబి, అలాగే 2023–24 విద్యాసంవత్సరంలో ప్రథమస్థానం పొందిన ఉన్నమట్ల సంజీవ్‌కుమార్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇంజేటి శైలజలకు దాత సుబ్బారావు నగదు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీరామమూర్తి, సహోపాధ్యాయులు తొంటా చలపతిరావు, నరసింహరావు, హనుమకుమారి, సరోజిని, చైతన్య, సత్తిబాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే



యలమంచిలి: మేడపాడులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్

పెనుగొండ: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పెనుగొండ తహసీల్దారు జి అనిత కుమారి అన్నారు. మంగళవారం పెనుగొండ మండలం రామన్నపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని భూ సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. డీటీ రాజేష్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఆచంటలో

ఆచంట మండలం కరుగోరుమిల్లిలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దారు ఎం సోమేశ్వరరావు వినతి పత్రాలు స్వీకరించారు. వినతుల పరిశీలన అనంతరం సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అరట్లకట్టలో..

పాలకొల్లు అర్బన్: వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డులను సరిచేసి రైతుల సమస్యలను పరిష్కరించడమే రీ–సర్వే లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ జి.నరేష్‌కుమార్ చెప్పారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట రైతు భరోసా కేంద్రంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ ఆర్ఎస్ఆర్ రిజిస్టర్‌లో ఆర్ ఎస్ నెంబర్‌కు బదులుగా రైతులకు ఎల్‌పీ నెంబర్ కేటాయించారన్నారు. అలాగే రికార్డులలో రైతుల పేర్లు తప్పులు ప్రచురించినా, భూముల హెచ్చు, తగ్గులు ఉన్నట్లుగా రైతులు గుర్తిస్తే ఆయా వివరాలతో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత దస్తావేజుల జిరాక్స్‌లను కూడా అందజేయాలని సూచించారు. వాటిని పరిశీలించి రీ సర్వే చేసి 45 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ రుద్రరాజు శ్రీనివాసరాజు (వాసు రాజు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్వేయర్ కేఎస్ఐ శైలజ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ : రామన్నపాలెం గ్రామ సభలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు అనిత కుమారి



పాలకొల్లు అర్బన్: అరట్లకట్టలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీటీ జి.నరేష్‌కుమార్

మేడపాడులో..

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు తమ భూములపై ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెల 30లోపు స్థానిక వీఆర్వోకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ కోరారు. రీ సర్వే పూర్తయిన మేడపాడు గ్రామంలో భూమి సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు మంగళవారం స్థానిక సచివాలయం వద్ద రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎం 304 లో 11 మంది రైతులు సబ్ డివిజన్ కోసం దరఖాస్తులు చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ గంటా శాంత కుమారి, ఎంపీటీసీ డేగల సూర్య ప్రభ వెంకటేశ్వరరావు, ఆర్ఐ యశోద, డివిజన్ సర్వేయర్ నెక్కంటి కోటిప్రసాద్, వీఆర్వోలు ఆకుల వెంకటేశ్వరరావు, గోటేటి లక్ష్మీ నరసింహారావు, కొడవటి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం: వంటగ్యాస్ వినియోగం విషయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని గోదావరి గ్యాస్ (భారత్ గ్యాస్ ఏజన్సీస్) నరసాపురం శాఖ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గ్యాస్ వినియోగం విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వంట గ్యాస్‌ను పొదుపు చేస్తూనే మరోవైపు వినియోగించే సమయంలో ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్యాస్‌కు నాణ్యత ఉన్న సంరక్షణ ట్యూబ్‌నే వినియోగించాలని చెప్పారు. ఐదేళ్లకు ఒకసారి ట్యూబ్‌ను మార్చాలని చెప్పారు. రాత్రి వేళల్లో కచ్చితంగా రెగ్యులేటర్‌ను కట్టేయాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో మెకానికర్స్ పి.శ్రీనివాస్, కె.సురేష్, ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.

రోగ పీడితులకు ఆర్థిక సహాయం



చెక్కులను అందజేస్తున్న క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు అన్నారు. వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం పలువురు రోగ పీడితులకు ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు వితరణతో చేసిన ఆర్థిక సహాయం చెక్కులను ఆయన అందజేశారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు గాదిరాజు అమ్మాజీకి రూ.20 వేల ఆర్థిక సహాయం చెక్కును సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు. అలాగే కవిటం గ్రామానికి చెందిన మేడపాటి సూర్యకుమారికి రూ.10 వేలు, పాలకొల్లు పట్టణానికి చెందిన సమటపు హేమంత్‌సాయికి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, పెన్మెత్స జగపతి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

అడుగడుగునా ఓ మడుగు



మొగల్తూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారిలో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



స్థానిక గాంధీ బొమ్మల రోడ్డు నుంచి వెంప వయా గొల్లగూడెం రహదారి దుస్థితి

మొగల్తూరు: మొగల్తూరులోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అసలే గోతులు, గొప్పులతో ఉన్న రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో మండలంలోని అనేక రహదారులను అభివృద్ధి చేశారు. మొగల్తూరు నుంచి నరసాపురం మండలం బేతపూడి వయా మొగల్తూరులోని గొల్లగూడెం, కొత్తపాలెం రహదారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ 12.64 కోట్లు మంజూరయ్యాయి. దీంతో రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా కొన్ని ప్రాంతాలలో ఆక్రమణలు కూడా తొలగించారు. అయితే అనివార్య కారణాలతో పనులు నిలిచిపోయాయి. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. మొగల్తూరు నుంచి భీమవరం వయా వెంప మీదుగా వెళ్ళే ప్రయాణికులు ఈ రహదారిలోనే ప్రయాణిస్తుంటారు. అలాగే రామాలయం నుంచి కోట మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, శేరేపాలెం గ్రామం వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి, ఈ రహదారి కూడా అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మొగల్తూరులోని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళే రహదారి గోతులు, గొప్పులతో పాటు వర్షపు నీరు నిలిచిపోవడంతో వివిధ పనుల నిమిత్తం స్టేషన్‌కు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు అధ్వానంగా ఉన్న రహదారులపై దృష్టి సారించి కనీసం మరమ్మతులైనా చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మండలిలో ప్రజాగళం వినిపిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)

యలమంచిలి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కోరారు. యూటీఎఫ్ మద్దతుతో పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థులు మాత్రమే శాసనమండలిలో ప్రజాగళాన్ని వినిపిస్తారని ఐవీ చెప్పారు. ఉపాధ్యాయులంతా సంఘటితంగా ఉండి పీడీఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్, మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు తదితరులు ఉన్నారు.

నేడు చించినాడలో రెవెన్యూ సదస్సు

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూమి సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు బుధవారం చించినాడ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చించినాడ గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పూజల్లో భాగంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని నరసాపురం ఆర్‌డీఓ దాసి రాజు వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. మంగళవారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకూ కార్తీకమాసం పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు భక్తులు, సేవా సంస్థల సభ్యులు, మీడియా సభ్యులు వివరించిన పలు సమస్యలపై ఆర్‌డీఓ దాసి రాజు మాట్లాడుతూ ఆలయంలో సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లలో భక్తులకు తొక్కిసలాట లేకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు కార్తీక దీపాలు ఆలయం లోపల ప్రాకార మండపంలో కాకుండా ప్రాకార మండపం బయట వెలిగించుకునేలా దేవాలయం, పోలీసు, ఫైర్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లో భక్తులకు తాగునీరు, చలివేంద్రం వంటివి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పంచారామ యాత్రికులు రాత్రి సమయాల్లో పడుకోవడానికి పట్టణంలో ఉన్న దేవదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన సత్రాలను ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చిస్తామని అన్నారు. పట్టణంలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే పంచారామ యాత్రికులు, స్థానిక భక్తుల వాహనాలు పార్కింగ్ కోసం సంత మార్కెట్ రోడ్డు, మార్కెటింగ్ యార్డు ప్రాంగణం, ద్విచక్ర వాహనాలకు బొండాడ కళాక్షేత్రం సెల్లార్‌లను పార్కింగ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం చుట్టుపక్కల, పట్టణ పరిసరాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా మునిసిపల్ శానిటరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. దేవాలయ పరిధిలో ఎవ్వరూ అన్యమత ప్రచారం చేయరాదని సూచించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ కార్తీకమాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తమకు సిబ్బంది కొరత ఉందని కొద్దిగా సిబ్బందిని పెంచే విధంగా ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, ఫైర్ ఆఫీసర్ వైవీ జానకిరామ్, ఎలక్ట్రికల్ ఏఈ ఎస్‌కే బాబ్జి, ఆలయ ప్రధానార్చకులు సన్నిదిరాజు రామకృష్ణ, అనిల్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.